సాక్షి వనపర్తి

బుధవారం । 19 । జూలై । 2023



పాలమూరు పచ్చబడింది..

ఎటుచూసినా పచ్చని పాలమూరు కనిపిస్తుందని ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు.

వివరాలు 8లో ►



సింథటిక్ ట్రాక్ వచ్చేనా..?

పాలమూరు స్టేడియంలో సింథటిక్ ట్రాక్ కోసం క్రీడాకారులు ఎదురుచూస్తున్నారు.

వివరాలు 10లో ►

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.6 /25.5

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్: జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వనపర్తి డిగ్రీ కో–ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని కో–ఎడ్ డిగ్రీ కళాశాలలో తెలుగు, కంప్యూటర్‌లో 3, ఇంగ్లిష్, రాజనీతి శాస్త్రం, హిస్టరీ సబ్జెక్టుల్లో రెండు, వాణిజ్యం, ఆర్థిక శాస్త్రం, జంతు శాస్త్రంలో ఒక్కొక్కటి.. మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్–4, తెలుగు, కంప్యూటర్స్–3, ఆర్థిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం ఒక్కొక్కటి.. పెబ్బేర్ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్, హిస్టరీ ఒక్కొక్కటి.. ఆత్మకూర్ డిగ్రీ కళాశాలలో తెలుగు, వాణిజ్యం, గణితం, జంతుశాస్త్రం, కంప్యూటర్స్‌లో ఒక్కో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 21లోగా ఆయా కళాశాలల్లో దరఖాస్తులు అందజేయాలని.. 22న డెమో, ఇంటర్వ్యూ జిల్లాకేంద్రంలోని డిగ్రీ కో–ఎడ్ కళాశాలలో ఉంటుందని, ఆసక్తిగల అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

పాన్‌గల్: సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన ఉంటూ ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని రేమద్దులలో నిర్వహించిన పార్టీ మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం దళితబంధు, బీసీల కులవృత్తులకు చేయూత పథకాలు తూతూమంత్రంగా కొందరికే అందిస్తూ చాలామందిని విస్మరించిందన్నారు. గృహలక్ష్మి పథకం ద్వారా అందించే రూ.3 లక్షలు ఇంటి నిర్మాణానికి ఏ మాత్రం సరిపోవని.. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇంటి స్థలాలు కేటాయించాలని, గిరిజనులకు పోడు పట్టాలు అందజేయాలన్నారు. ఎన్నికల హామీలు అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రజలతో కలిసి ఉద్యమిస్తూ సంక్షేమ పథకాలు అర్హులందరికి అందించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పార్టీ బలోపేతానికి నాయకులు, నాయకులు సంఘటితంగా పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి దేవేందర్, నాయకులు వెంకటయ్య, భగత్, నిరంజన్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి 20 మంది విద్యార్థులు

వనపర్తిటౌన్: క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 13న నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో 20 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు డీవైఎస్‌ఓ సుధీర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొత్తం 125 మంది విద్యార్థులు హాజరుకాగా 95 మంది విద్యార్థులు ఎంపిక కాలేదన్నారు. 4వ తరగతికిగాను ఆరుగురు బాలురు, నలుగురు బాలికలు, 5వ తరగతికిగాను 8 మంది బాలురు, ఇద్దరు బాలికలు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు హకీంపేట క్రీడా పాఠశాలలో ప్రవేశం పొందనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులు వీరే..

నాలుగో తరగతి : సాయిరుత్విక్, ఎస్.నరేష్, ఏ.హేమంత్‌కుమార్, వై.మహేష్, ఎం.విహాన్, వర్షిత్, సాయిమహిబాల, ఎస్.స్వాతి, రూన్సీ రాణి, కె.సాహిత్యప్రభ.

5వ, తరగతి: విహాన్, సురేష్‌నాయక్, డి.సురాజ్‌గౌడ్, అంకుర్ వితాన్‌తేజ్, ఎం.అశ్విత్‌నాయక్, జి.మహేమంత్‌కుమార్, నవీన్, గౌతం, కావలి లావణ్య, ఎం.శ్రీనిఖిలాక్షి.

సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం



వనపర్తి: స్వీపర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సురేష్, జిల్లా కార్యదర్శి మాసన్న స్పష్టం చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలో స్వీపర్లు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారికి ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించిన స్వీపర్లను పోలీసులు అడ్డుకున్నారు. కాసేపు వాగ్వాదం తర్వాత కొందరు స్వీపర్లు డిమాండ్ల వినతిపత్రాన్ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు అందజేశారు. స్వీపర్ల సంఘం జిల్లా కార్యదర్శి ఖాజాపాషా, రషీద్, ఖయ్యూం, నగేష్, రమేష్, వెంకటయ్య, శోభారాణి, సుగుణమ్మ, మాలిక్, గోపాల్‌గౌడ్, అఫ్జల్, ముకుంద తదితరులు పాల్గొన్నారు.


పేదరికంలోనే పాలమూరు జిల్లాలు

- జోగుళాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానం
- నీతి ఆయోగ్ బహుముఖ పేదరిక సూచి రిపోర్ట్‌లో వెల్లడి



సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇంకా అధికశాతం ప్రజలు పేదరికంలో మగ్గుతూనే ఉన్నారు. ఈ విషయంలో జోగుళాంబ గద్వాల జిల్లా 15.37 శాతం బహుముఖ పేదరిక సూచి(ఎంపీఐ)తో రాష్ట్రంలో రెండోస్థానంలో ఉంది. మిగతా జిల్లాల్లోనూ పెద్దసంఖ్యలో పేదలు ఉన్నట్టు నీతి ఆయోగ్ ఇటీవల విడుదల చేసిన ఎంపీఐ ప్రోగ్రెస్ రివ్యూ 2023 నివేదికలో వెల్లడయింది. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే(ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) ద్వారా జిల్లాల్లోని ప్రజల ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాల స్థాయిని బట్టి బహుముఖ పేదరిక సూచిని లెక్కించారు. ఇందులో ప్రధానంగా పోషకాహారం, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం, శిశు మరణాలు, పాఠశాలల్లో హాజరుశాతం, వంటగ్యాస్, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్తు, సొంత ఇళ్లు, ఆస్తులు, బ్యాంకు ఖాతాలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రజల జీవన ప్రమాణాల స్థాయి, పేదరిక సూచిని లెక్కించారు.

■ రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా పేదరికం ఉన్న జిల్లాల్లో కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా 16.59 శాతంతో మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానంలో 15.37 శాతంతో జోగుళాంబ గద్వాల జిల్లా నిలిచింది. తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా 10.27 శాతంతో రాష్ట్రంలో 8వ స్థానంలో ఉండగా, 8.86 శాతంతో వనపర్తి జిల్లా 8వ స్థానంలో ఉంది. ఉమ్మడి జిల్లాలో నాగర్‌కర్నూల్ మెరుగైన స్థానంలో ఉంది. మిగతా జిల్లాల కన్నా తక్కువగా 5.95 శాతం పేదరిక సూచితో నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచింది. అలాగే దారిద్య్రరేఖకు దిగువన ఉన్న వారిని హెడ్ కౌంట్ రేషియోగా పేర్కొనగా, మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి 2015–16లో 24.72 శాతం నుంచి 2019–21 నాటికి 10.27 శాతానికి తగ్గింది. పేదరిక సూచి 0.108 నుంచి 0.041కి తగ్గింది.



జిల్లా	హెడ్‌కౌంట్ రేషియో	ఇంటెన్సిటీ	ఎంపీఐ
మహబూబ్‌నగర్	10.27శాతం	40.35శాతం	0.041
నాగర్‌కర్నూల్	5.95 శాతం	41.11శాతం	0.024
వనపర్తి	8.86 శాతం	43.06శాతం	0.038
జోగులాంబగద్వాల	15.37 శాతం	41.24 శాతం	0.063

లింక్ కెనాల్‌ను మింగేశారు!

- కోయిల్‌సాగర్ కాల్వకు సేకరించిన ప్రభుత్వ భూమి మాయం
- సర్వే చేసి 80 ఎకరాలకు పాతిన హద్దు రాళ్ల తొలగింపు
- మరికల్ శివారులో 52, 87, 731 సర్వేనంబర్లలో వెలిసిన వెంచర్లు
- రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో అక్రమార్కుల కుమ్మక్కు
- రాజకీయ నేతల అండతో రియల్టర్ల స్వాహా పర్వం
- కలగానే మిగిలిన వెయ్యి ఎకరాలకు సాగు నీరు..

అధికార యంత్రాంగం నిద్రమత్తా.. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపమా.. ధనదాహమా.. ఏదేమైనా అక్రమార్కులు కోయిల్‌సాగర్ లింక్ కెనాల్ భూములకు ఎసరుపెట్టారు. సుమారు వెయ్యి ఎకరాలకు సాగు నీరందించాలనే లక్ష్యంతో కాల్వ కోసం రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన భూమిని కాజేసేందుకు స్కెచ్ వేశారు. ముందుకు పక్కా ప్రణాళికతో హద్దు రాళ్లు తొలగించారు. కాల్వ నిర్మించాల్సిన స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా చదును చేసి.. వెంచర్లు ఏర్పాటు చేశారు. అధికార, రాజకీయ, ధనబలంతో నారాయణపేట జిల్లా మరికల్ శివారులో రాయచూర్ ప్రధాన రహదారి వెంట చోటుచేసుకున్న రియల్టర్ల భూ బాగోతంపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్



లింక్ కెనాల్‌కు సేకరించిన సర్వే నంబర్ 52లో ఏర్పాటవుతున్న వెంచర్

80 ఎకరాల భూసేకరణ..

కోయిల్‌సాగర్ ఎత్తిపోతల కింద తీలేర్ పంప్ హౌస్ నుంచి నేరుగా డీ–16 కాల్వ తీశారు. అప్పంపల్లి, మరికల్ గ్రామాల శివార్ల మధ్య ఈ కెనాల్ నుంచి మరికల్, కన్మనూర్, జిన్నారం గ్రామాల ఆయకట్టుకు సాగు నీరందించేలా.. అక్కడి నుంచి గురుకుల పాఠశాల ముందు డిస్ట్రిబ్యూటర్‌కాల్వ ఏర్పాటు చేశారు. మరికల్, పస్పుల, ఎలిగండ్ల గ్రామాల కింద ఉన్న మరో 830 ఎకరాలకు అదనంగా సాగు నీరందించేందుకు 2013లో మరికల్ శివారులోని 52, 53, 87, 89, 92, 94, 703, 731, ఎలిగండ్ల శివారులోని 78, 77, 80సర్వే నంబర్ల మీదుగా లింక్ కెనాల్ కోసం భూ సేకరణ చేశారు. సుమారు 80 ఎకరాల భూమిని సేకరించి హద్దు రాళ్లు పాతారు. సర్వే నంబర్ 52 దగ్గర డిస్ట్రిబ్యూటర్ కాల్వ నుంచి లింక్ కెనాల్‌ను మళ్లించేందుకు పూనుకున్నారు.

రాయచూర్ ప్రధాన రహదారి మార్గంలో రోడ్డు వెంట కమర్షియల్ భూములు కావడంతో కొందరు రైతులు లింక్ కెనాల్ రాన్వివకుండా అడ్డుకున్నారు. సర్వే చేయడానికి వచ్చిన సర్వేయర్లతో గొడవలకు దిగి తిప్పి పంపిన ఘటనలు ఉన్నాయి. అధికారులు ఎలాగోలా సర్వే పూర్తి చేసి భూసేకరణ తంతు ముగించారు. కెనాల్‌కు సేకరించిన భూమికి సంబంధించి సుమారు 80 ఎకరాలకు పాత భూ పరిహారం చట్టం కింద దాదాపు రూ.80లక్షలను నారాయణపేట జిల్లా సివిల్ కోర్టులో 2018లో డిపాజిట్ చేశారు. అయితే రైతులు ఎవరూ ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం తీసుకోలేదు. కానీ.. నిబంధనల ప్రకారం పరిహారం డబ్బులు ఎప్పుడైతే కోర్టులో జమ అయ్యాయో.. ఆ రోజు నుంచి సదరు భూమి ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చినట్లే. ఆ తర్వాత లింక్ కెనాల్ నిర్మాణాన్ని ఏ కారణం చేతనో అధికారులు పట్టించుకోలేదు.

పరిహారం సైతం జమ..

దొడ్డి దారిన నాలా అనుమతులు..

లింక్ కెనాల్ నిర్మాణాన్ని అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ విషయం మరుగునపడింది. దీన్ని అవకాశంగా తీసుకున్న పలువురు రియల్టర్లు గుట్టుచప్పుడు కాకుండా లింక్ కెనాల్‌కు ప్రభుత్వం సేకరించిన భూములను సదరు రైతుల వద్ద కొనుగోలు చేశారు. మరికల్ శివారులోని సర్వే నంబర్లు 52, 87, 731, ఎలిగండ్ల శివారులోని 78, 80 సర్వే నంబర్లలో దొడ్డిదారిన రెవెన్యూ అధికారుల నుంచి నాలా అనుమతులు పొందారు.

ఇరిగేషన్, రెవెన్యూ శాఖలపై అనుమానాలు

లింక్ కెనాల్ కోసం సర్వేనంబర్ 87లో సేకరించిన 1.32 ఎకరాల భూమికి రూ.5,97,436.. సర్వే నంబర్ 731లో 1.03 ఎకరాల భూమికి రూ.3,39,924 నష్ట పరిహారం కోర్టులో జమచేశారు. ఈ సర్వే నంబర్లతో పాటు 52లో కూడా అక్రమంగా వెంచర్లు వెలిశాయి. నిబంధనల ప్రకారం కెనాల్ తవ్వే స్థలంతో పాటు, బఫర్ జోన్ కింద ఆరు మీటర్ల వరకు వదిలేసి నిర్మాణాలు చేపట్టాలి. ఇవేమీ పట్టించుకోకుండానే రియల్టర్లు గుట్టుచప్పుడు కాకుండా వెంచర్లు చేసి.. ప్లాట్లుగా విభజించి అమ్మకానికి పెట్టారు. ఇంత జరుగుతున్నా అటు రెవెన్యూ, ఇటు ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లింక్ కెనాల్ కోసం రైతుల వద్ద సేకరించిన భూమికి నాలా కోసం రెవెన్యూ అధికారులు అనుమతులివ్వడం, డీటీసీపీ అప్రూవల్ పొందడంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇక్కడ ఎకరాకు రూ.కోటి పలుకుతోంది. ఈ మేరకు సర్వే నంబర్ 52, 87, 731లో సుమారు మూడు ఎకరాల్లో రియల్టర్లు వెంచర్లు ఏర్పాటు చేశారు. దాదాపుగా రూ.3 కోట్లు దండుకునే ఈ స్కెచ్‌లో రాజకీయ, ఉన్నతాధికారుల హస్తం కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సర్వేనంబర్ 731లో..



సర్వేనంబర్ 87లో..

మా దృష్టికి రాలేదు..

లింక్ కెనాల్ భూసేకరణకు సంబంధించి అప్పటి రెవెన్యూ అధికారులు, సర్వేయర్లకు తెలుసు. ఈ అంశంపై మా వద్ద సమాచారం లేదు. ప్రభుత్వం సేకరించిన భూమిలో వెంచర్లు ఏర్పాటు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. *– రాంకోటి, తహసీల్దార్, మరికల్*

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన కేంద్ర బృందం

కొత్తకోట: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సుశీల్ సింగ్ బృందం సందర్శించింది. ఠాణాలో నమోదైన కేసులు, విచారణ, మహిళల భద్రతకు తీసుకుంటున్న చర్యలు, డ్రగ్స్ నియంత్రణ, పోలీసుల పనితీరుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయం, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీసుల పనితీరుపై మంచి అభిప్రాయం ఉందన్నారు. రాష్ట్రంలోని ఉత్తమ 30 పోలీస్‌స్టేషన్లను అవార్డుల కోసం ఎంపిక చేశారని.. అందులో కొత్తకోట పోలీస్‌స్టేషన్ కూడా ఉందని ఎస్‌ఐ తెలిపారు.

శాస్త్రీయ సాగుతో అధిక దిగుబడులు

మదనాపురం: రైతులు సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డా. దాదాసాహెబ్ ఖోగరే సూచించారు. బుధవారం మండలంలోని కొత్తపల్లిలో కేవీకే ఆధ్వర్యంలో భారతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాస్త్రవేత్త సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 731 కృషి విజ్ఞాన కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ శాస్త్రవేత్త అడుసూరి మస్తానయ్య వరిలో యాంత్రీకరణ, నీటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. అనంతరం 35 మంది రైతులకు తడి, పొడి పద్ధతుల్లో నీటి యాజమాన్య పైపులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆ పైపును వరి నాటిన తర్వాత పొలంలో ఏ విధంగా అమర్చాలి.. నీటి యాజమాన్యాన్ని ఎలా గుర్తించాలో అవగాహన కల్పించారు. కొత్తరకం వంగడాలు, వర్మీ కంపోస్ట్, బయో ఫెర్టిలైజర్స్, చిరుధాన్యాలు, పండ్ల మొక్కలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, కేవీకే సిబ్బంది నాగేందర్, సుందర్, రైతులు మహిళా రైతులు పాల్గొన్నారు.



శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్

- డీఎస్పీ ఆనంద్‌రెడ్డి

కొత్తకోట: శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని డీఎస్పీ ఆనంద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి పట్టణంలోని కోట్ల ఆంజనేయస్వామి వీధి, ఎస్సీకాలనీలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రతి ఇంటిని తనిఖీ చేసి ఇంట్లోని వ్యక్తుల ఆధార్ కార్డులు, వాహనాలకు సంబంధించిన పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు, రాజకీయ నాయకులు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుకొని మంచి భవిష్యత్‌ను ఎంచుకోవాలని సూచించారు. ఇళ్ల అద్దెకు వచ్చే వారి పూర్తి వివరాలను యజమానులు తీసుకోవాలని, ఇళ్లల్లో విలువైన ఆభరణాలు, పెద్ద మొత్తంలో నగదు ఉంచుకోవద్దన్నారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే డయల్ 100కు, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకురావాలని, పట్టణంలోని అన్ని కాలనీల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తామని తెలిపారు. కార్డెన్ సెర్చ్‌లో 70 మంది పోలీసులు పాల్గొనగా పత్రాలు లేని ఒక ఆటో, 65 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. తనిఖీల్లో కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐలు హరిప్రసాద్, మురళి, శ్రీహరి, జగదీష్, హరీశ్, ఏఎస్‌ఐలు సాగర్, రోశయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వివరాలు ఆరా తీస్తున్న పోలీసులు

డీసీఎస్‌ఓగా సుదర్శనం

- ఇద్దరు ఏఎస్‌ఎస్‌ఓలు బదిలీ

వనపర్తి: అనధికారిక సెలవుపై వెళ్లారని కలెక్టర్ సరెండర్ చేసిన డీసీఎస్‌ఓ సుదర్శనంను 317 జీఓ అమలులో భాగంగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ అధికారాలు మళ్లీ వనపర్తి డీసీఎస్‌ఓగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బదిలీల్లో భాగంగా అదిలాబాద్ నుంచి వనపర్తికి బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాలో ఏఎస్‌ఎస్‌ఓలుగా పనిచేస్తున్న బి.రాజేందర్‌ను మహబూబాబాద్‌కు, జి. బాబావినోద్‌కుమార్‌ను కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మూడోసారి అధికారం బీఆర్‌ఎస్‌దే..

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ అధికారం చేపట్టడం ఖాయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని బాదం సరోజాదేవి కల్యాణ మండపంలో నిర్వహించిన మండల బీఆర్‌ఎస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ఒక్కో గ్రామానికి చెందిన నాయకులు, ప్రజలతో ప్రత్యేకంగా మాట్లాడారు. గ్రామంలో చేపట్టిన పనులు, అందుతున్న సంక్షేమ పథకాలు, చేపట్టాల్సిన పనులు తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీ గెలుపును ఏ శక్తులు ఆపలేవని.. కరోనాలాంటి విపత్తు సమయంలోనూ రైతులను ఆదుకున్నది ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. పడావు పడిన చెరువులను పునరుద్ధరించి సాగునీటితో బీడు భూములను సస్యశ్యామలం చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని తెలిపారు. నిజాలాపురం నుంచి మహ్మద్ హుస్సేన్‌పల్లి వరకు రహదారి నిర్మాణానికిగాను రూ.3.30 కోట్లు మంజూరయ్యాయని.. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని వివరించారు. రాష్ట్రంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని.. నేడు కొందరు 3 గంటల విద్యుత్ చాలంటూ మాట్లాడటం బుద్ధి తక్కువ పని అన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా తెలంగాణ ప్రజలు నమ్మరని తెలిపారు. రంగులు మార్చుకొని వచ్చే వారి మాటలు నమ్మకుండా వచ్చే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో బీఆర్‌ఎస్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, జిల్లా మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బాలీశ్వర్‌రెడ్డి, మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మండల రైతు సమితి కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రావు, వెంకటయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

20న లక్కీడిప్

వనపర్తిటౌన్: బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో నాన్ రెసిడెన్షియల్, 5వ తరగతిలో రెసిడెన్షియల్ ప్రవేశాలకుగాను విద్యార్థులను గురువారం లక్కీడిప్ విధానంలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నుశిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీకృత కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడిప్ ఉంటుందని.. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరుకావాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంలో యువరైతు మృతి


కుర్వ రాము (ఫైల్)

కేటీదొడ్డి: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో యువరైతు మృతి చెందిన ఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కేటీదొడ్డికి చెందిన కుర్వ రాము(26) రోజు మాదిరిగానే వ్యవసాయ పొలానికి వెళ్లాడు. పొలం దగ్గర మోటర్ పని చేయకపోవడంతో సమస్య ఉందని సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య వాణి, కుమారుడు ఉన్నారు. వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించారు.
ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ సరిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని వారు భరోసా ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..

మానవపాడు: జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని డీసీఎం డ్రైవర్ ఓవర్ టేక్ చేయబోయి ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి జల్లాపురం స్టేజీ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాము కథనం ప్రకారం..హిమచల్ ప్రదేశ్‌కు చెందిన దేవరాజ్(30) డీసీఎంలో పండ్లు లోడ్ చేసుకోని కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి జల్లాపురం స్టేజీ సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. దేవరాజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అలంపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

మహబూబ్‌నగర్ న్యూటౌన్(హన్వాడ): హన్వాడలో బోనాల పండుగకు కూతురు ఇంటికొచ్చిన వ్యక్తి ప్రమాదానికి గురై ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కోడూర్ గ్రామానికి చెందిన హరిజన్ వెంకటయ్య(80) ఈ నెల 11న బోనాల పండుగకు హన్వాడలోని కూతురు నాగమ్మ ఇంటికొచ్చాడు. 12న ఉదయం బజారుకెళ్లి టీ తాగి ఇంటికొస్తుండగా ప్రమాదవశాత్తు డ్రైనేజీ కాలువలో జారీ పడ్డాడు. దీంతో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే అతన్ని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియాకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవినాయక్ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

మహబూబ్‌నగర్ క్రైం: పాఠశాల నుంచి లంచ్ బ్రేక్‌లో బయటికెళ్లిన విద్యార్థి అదృశ్యమైన ఘటన మంగళవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలో మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో వీర రాఘవ ఆరో తరగతి చదువుతున్నాడు. లంచ్ బ్రేక్‌లో బ్యాగ్, టిఫిన్ బాక్స్ స్కూల్లోనే వదిలేసి విద్యార్థి బయటికి వెళ్లాడు. పాఠశాలకు తిరిగి రాకపోవడంతో స్కూల్ యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సాయంత్రమైనా ఇంటికి రాలేదని వారు చెప్పడంతో స్కూల్ ప్రిన్సిపాల్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ తెలిపారు.

మృతదేహం లభ్యం

జడ్చర్ల: మండల పరిధిలోని కోడ్గల్ గ్రామ శివారులో గల పాడుబడిన వ్యవసాయ బావిలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని(35) పోలీసులు గుర్తించారు. సీఐ రమేశ్ బాబు కథనం మేరకు.. కోడ్గల్–కుర్వపల్లి గ్రామాల శివార్లలోని పాడుబడిన కోల్‌బాయి నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు గమనించి బాయిలో చూశారు. నీటిలో ఓ వ్యక్తి మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో నడుము భాగం వరకు మాత్రమే లభ్యమైంది. తల, నడుము భాగాలు కుళ్లి నీటిలోనే కలిసిపోయాయి. కేవలం అస్థిపంజరంలోని కొన్ని ఎముకలు మాత్రమే లభించాయి. బావిలో మృతుడి జీన్స్ ప్యాంట్ మినహా ఇతర ఆధారాలేవి లభించలేదు. పోలీసులు డాక్టర్‌తో అక్కడే పోస్టుమార్టం చేయించి పూడ్చి వేశారు. మృతదేహం ఆనవాళ్లను బట్టి గతంలో నమోదైన మిస్సింగ్ కేసులకు సంబంధించి పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దాయాదుల ఘర్షణ

మహమ్మదాబాద్: ఇళ్లకు వెళ్లే రోడ్డు విషయంలో దాయాదులు ఘర్షణ పడటంతో కేసు నమోదు చేసిన ఘటన గండేడ్ మండలంలో చోటు చేసుకుందుది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం మన్సూర్‌పల్లి తండాకి చెందిన అఖిల్ మంగళవారం తన ఇంటికి వెళ్లే దారిలో ఉన్న రాళ్లను ట్రాక్టర్‌తో తొలగిస్తున్నాడు. తనకు తాతవరుసైన కిషన్‌నాయక్ అడ్డువచ్చి తన కుటుంబీకులతో కలిసి అఖిల్ కుటుంబీకులపై కర్రలతో, రాళ్లతో దాడిచేశారు. బాధితుడు అఖిల్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

కోళ్లఫారాలే.. తరగతి గదులు

- మూడేళ్లుగా అక్కడే చదువుకుంటున్న విద్యార్థులు
- దుస్థితిలో మరుగుదొడ్లు.. ఎండలు, వానలకు బెంబేలు
- నెల అద్దె రూ.1.20 లక్షలు, కరెంట్ బిల్లు అదనం
- దీనస్థితిలో తెలకపల్లి బీసీ వెల్ఫేర్ బాలుర పాఠశాల

కందనూలు: కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ బడులను నడిపిస్తున్నామని పాలకులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. గత మూడేళ్లుగా రెండు కోళ్ల ఫారాల్లో పాఠశాల తరగతులు నిర్వహిస్తున్నారంటే నమ్మశక్యం కాని పరిస్థితి. నాగర్‌కర్నూల్ జిల్లాలోని తెలకపల్లిలో ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే బీసీ బాలుర పాఠశాల రెండు కోళ్ల ఫారాల్లో తరగతులు, వసతి అన్ని అందులోనే. ఇందులో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తుండగా.. 480 మంది విద్యార్థులు, 20 మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఉన్నారు. వీరందరికి కలిపి కేవలం 15 మరుగుదొడ్లే ఉండగా.. ఇందులోనూ ఆరు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. ప్రస్తుతం మరో 10 మరుగుదొడ్లు నిర్మాణంలో ఉన్నాయి. ఇందుకోసం రెండు కోళ్ల ఫారాల నెల అద్దె అక్షరాల రూ.1.20 లక్షలు, కరెంట్ బిల్లు అదనంగా చెల్లిస్తుండటం గమనార్హం.

భరించలేని ఉక్కపోత..

పాఠశాల పైకప్పు రేకులు కావడంతో వర్షానికి భారీ శబ్దాలు, ఎండకు తీవ్ర ఉక్కపోతతో విద్యార్థులు చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. రాత్రి చలి పెడితే అంతే సంగతులు. అంతేకుండా 40 నుంచి 50 మంది ఉండే ఒక్కో తరగతి గదిలో రెండు ఫ్యాన్లు మాత్రమే ఉన్నాయి. కొన్ని తరగతి గదుల్లో రెండు ఫ్యాన్లు ఉంటే ఒకటి పని చేయదు. బాలుర పాఠశాలలో 480 మంది విద్యార్థులకు నూకలతో చేసిన అన్నం పెడుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఈసారే ఇలా వచ్చాయనే సమాధానం చెబుతున్నారు.




కోళ్ల ఫారంలో కొనసాగుతున్న తెలకపల్లి ఎంజేపీటీ బీసీ వెల్ఫేర్ బాలుర పాఠశాల


కోళ్లఫారంలో విద్యార్థులు


దోర్లు లేని మరుగుదొడ్లు

బెదిరింపులు..

480 మంది విద్యార్థులకు 15 మరుగుదొడ్లు ఏంటని అడిగిన సాక్షి విలేకరిని పాఠశాలలోకి ఎవరు పంపించారు.. అనుమతి లేకుండా లోపలికి ఎందుకు వచ్చావంటూ కోళ్ల ఫారాల యజమాని దబాయించడం కొసమెరుపు. ఎంతో మందిని చూశాం.. మీరు మాకు లెక్కకాదని.. ఫొటోలు తీస్తే బాగుండదని బెదిరింపులకు దిగారు. అప్పటికే పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అనుమతితో తరగతులు, వంటశాలను పరిశీలిస్తున్న విలేకరులను బెదిరిస్తున్నా ఉపాధ్యాయులు కిమ్మనకుండా ఉండిపోయారు. ఈ రెండు కోళ్ల ఫారాలను అద్దెకు ఇచ్చారుగా మళ్లీ మీరెందుకు ఇక్కడికి వచ్చారని ప్రశ్నిస్తే ఇదంతా తనదేనని, నాకు అందరు తెలుసు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని గద్దించారు.

➡ ఈ విషయమై ప్రిన్సిపల్ ప్రశాంతి స్పందిస్తూ పాఠశాల అద్దెకు సంబంధించి ఫండ్స్ సరిగా రావడం లేదన్నారు. అలాగే పాఠశాల నిర్వహణకు సరైన భవనాలు లభించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇక్కడి ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

పాలమూరు పచ్చబడింది..

- విశ్వకర్మ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి, వేదికపై ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, తదితరులు

సాక్షి, నాగర్‌కర్నూల్: తెలంగాణ ప్రభుత్వం వచ్చాక పాలమూరులో కరువు కనుమరుగయ్యిందని, పచ్చని పాలమూరుగా కనిపిస్తోందని రాష్ట్ర శాసన సభా మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. జిల్లాకేంద్రంలో మంగళవారం నిర్వహించిన విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఆత్మగౌరవ ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ప్రముఖ కవి కపిలవాయి లింగమూర్తి జన్మించిన గడ్డపై తనకెంతో అభిమానం ఉందన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి సృష్టికర్తలుగా ఉన్న విశ్వకర్మలు ఉన్నత స్థానంలోకి ఎదిగాలని చెప్పారు. విశ్వకర్మలు రాజ్యాధికారం సాధించేందుకు అందరూ ఐక్యమత్యంగా ఉండాలని కోరారు. విశ్వకర్మల సంక్షేమం కోసం హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్‌లో ఐదెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించినట్టు చెప్పారు. రాష్ట్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలకు ధూపదీప నైవేద్యం కింద దేవాదాయ శాఖలో భాగస్వామ్యం కల్పించామని, ఫారెస్ట్ అధికారుల నుంచి ఇబ్బందులను తొలగించేందుకు జీఓ 69ను రద్దు చేసుకున్నామని వివరించారు. విశ్వకర్మల బిడ్డగా జన్మించిన తనకు రాష్ట్ర మొదటి శాసన సభాపతిగా సీఎం కేసీఆర్ అవకాశం ఇచ్చారన్నారు. పిల్లల చదువు, భవిష్యత్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చి అందరూ ఎదిగేందుకు కృషి చేయాలని చెప్పారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ జిల్లాలోని ప్రముఖ మద్దిమడుగు దేవస్థానం చైర్మన్‌గా విష్ణుమూర్తికి అవకాశం ఇచ్చామని, విశ్వకర్మల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు.
– జిల్లాకేంద్రంలో రూ.3 కోట్లతో గ్రంథాలయం నిర్మాణం చేపట్టనున్నామని, ఇందులో కపిలవాయి లింగమూర్తి గ్రంథాలను ప్రత్యేకంగా భద్రపరుస్తామని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. త్వరలోనే తన సొంత నిధులతో కపిలవాయి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్టు హామీఇచ్చారు. జిల్లాకేంద్రంలో విశ్వకర్మలకు కమ్యూనిటీ భవనం నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. వేదం కన్నా ముందు నుంచే విశ్వకర్మ ఉన్నాడని, మానవ జీవనానికి సుఖమయం చేసే తపన విశ్వకర్మలది అని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వకర్మలకు సబ్సిడీతో పనిముట్లు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీపాచారి, విశ్వకర్మల రాష్ట్ర అధ్యక్షుడు మదన్‌మోహన్, జిల్లా అధ్యక్షుడు పాండుచారి, చంద్రమౌళి, వెంకటాచారి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్లు కల్పన, విజయలక్ష్మి, సీపీఐ నాయకుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మర్రి, నాగం సరదా సంభాషణ..


ఎమ్మెల్యే మర్రి, మాజీమంత్రి నాగం మధ్య సంభాషణ

నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి మధ్య మంగళవారం సరదా సంభాషణ చోటుచేసుకుంది. జిల్లాకేంద్రంలో విశ్వకర్మలు నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి, బీజేపీ నేత దిలీపాచారి హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం తిరుగుపయనంలో మర్రి జనార్దన్‌రెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి ఒకరినొకరు పలకరించుకోవడంతో సరదా సన్నివేశం నెలకొంది. మొదటగా నాగం అనుచరుడు లక్ష్మయ్యతో మర్రి మాట్లాడుతూ.. లక్ష్మణ్ అన్నా.. మీ సారుకు గట్టిగ చేయ్.. ఏం చేస్తున్నరు అన్నా.. పెద్దమనిషి కష్టపడ్డాడు, వదిలిపెట్టకండి. అనవసరంగా పోనియకండి.. టికెట్టు తెచ్చుకోండి అంటూ వ్యాఖ్యానించారు. ఈసారి కచ్చితంగా కాంగ్రెస్ జెండా ఎగరవేసుడే అంటూ నాగం అనుచరులు బదులిచ్చారు. పెద్దమనిషిని మంత్రిని చేద్దాం అంటూ మర్రి వ్యాఖ్యానించారు.

కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

- నాగర్‌కర్నూల్ జిల్లా కోమటికుంటలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

లింగాల: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఓ గురువు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు గురిచేయడంతో గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని కోమటికుంట ప్రాథమికోన్నత పాఠశాలలో వెంకటేష్ ఎస్‌జీటీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సదరు ఉపాధ్యాయుడు విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. విషయం తెలుసుకున్న హెచ్‌ఎం అంజిలాల్ పలుమార్లు ఉపాధ్యాయుడిని తీవ్రంగా మందలించాడు. ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో చివరికి హెచ్‌ఎం ఎంఈఓ దృష్టికి తీసుకువెళ్లాడు. దీంతో ఎంఈఓ అతనిని కొన్ని రోజుల క్రితం అవుసలికుంట ప్రాథమిక పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపారు. ఈ క్రమంలో ఉపాధ్యాయుడి లైంగిక వేధింపుల గురించి తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఈ నెల 14న అవుసలికుంటలో అతడు పనిచేస్తున్న దగ్గరికి వెళ్లి కోమటికుంటకు తీసుకువచ్చి చితకబాది విద్యార్థుల కాళ్లను మొక్కించారు. దెబ్బలకు సొమ్మసిల్లి పడిపోవడంతో వదిలేసి వెళ్లిపోయారు. ప్రస్తుతం సదరు ఉపాధ్యాయుడు వెంకటేష్ సెలవులో ఉన్నాడు. గతేడాది విద్యా సంవత్సరం ముగింపు సమయంలో నారాయణపేట జిల్లా మద్దూరు నుంచి బదిలీపై కోమటికుంటకు వచ్చాడు. గతంలో అక్కడ కూడా ఇదే రకంగా వ్యవహరించి దెబ్బలు తిన్నట్లు తెలిసింది.

డీఈఓకు ఫిర్యాదు చేశా..

కోమటికుంట ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వెంకటేష్ వ్యవహారాన్ని డీఈఓ దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎంఈఓ చంద్రుడు తెలిపారు. ప్రస్తుతం ఆ ఉపాధ్యాయుడు సెలవులో ఉన్నాడని, డీఈఓ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పరిహారం అడిగితే బెదిరిస్తున్నారు..

- మార్కండేయ ప్రాజెక్టు నిర్వాసిత రైతు ఆరోపణ


విలపిస్తున్న రైతు బోయిని బాబు

బిజినేపల్లి: మండలంలోని మార్కండేయ ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న తమకు ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండానే పనులు మొదలుపెడుతోందని గంగారం గ్రామానికి చెందిన రైతు బోయిని బాబు వాపోయారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరుల ఎదుట మాట్లాడుతూ ×నాకున్న 4 ఎకరాల పట్టా భూమి మార్కండేయ కెనాల్ కిందపోతుందని, ఎకరాకు ఎంత పరిహారం ఇస్తామన్నది ఎవరూ చెప్పడం లేదన్నారు. పరిహారం గురించి అడిగితే స్థానిక ప్రజాప్రతినిధులు చంపుతామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. మార్కండేయ ప్రాజెక్టు కోసం మొదట 2018లో చేసిన ప్లానింగ్‌కు కొంతమందికి అనుకూలంగా ఉండేందుకు అలైన్‌మెంట్ మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయమైన పరిహారం ఇచ్చిన తర్వాతే భూముల్లో ప్రాజెక్టు పనులు మొదలుపెట్టాలని కోరారు.


మహిళ ఆత్మహత్యాయత్నం


కలెక్టరేట్ గేటు ఎదుట పెట్రోలు పోసుకుంటుండగా అడ్డుకుంటున్న సెక్యూరిటీ సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట మహిళ పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బిజినేపల్లి మండలంలోని సల్కర్‌పేటకు చెందిన జ్యోతి భర్తకు సంబంధించిన రెండెకరాల భూమిని బావ వెంకట్‌రెడ్డి తనపేరిట పట్టాచేయించుకున్నాడు. భూవివాదానికి సంబంధించి రెండేళ్లుగా ఇరువురి మధ్య గొడవ నడుస్తోంది. దీనిపై ఇదివరకే ఆమె కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసింది. సమస్య పరిష్కారం కాకపోవడంతో మంగళవారం కలెక్టరేట్ గేటు ముందు ఒంటిపై పెట్రోలు పోసుకుంటుండగా వెంటనే అక్కడున్న సెక్యూరిటీ సిబ్బంది ఆమెను అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

విత్తులో నాణ్యమైన గింజల ఎంపిక

- నాణ్యమైన గింజలనే విత్తనాలుగా వాడాలి
- 90శాతం విత్తనాలు మంచివిగా ఉండాలి


ట్రే పద్ధతిలో మొలక శాతం పరీక్ష

అలంపూర్: విత్తనం బాగుంటే మొలక బాగా వస్తుంది. మొలకలు బాగా వస్తే మొక్కలు బాగా పెరుగుతాయి. అందుకే విత్తు కోసం నాణ్యమైన గింజలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచించారు. నాణ్యమైన విత్తనాలను క్రమ పద్ధతిలో కడితే దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. విత్తనాలను మొలక కట్టి నాణ్యత ప్రమాణాలను బట్టి ఎంపిక చేసుకోవచ్చు. విత్తనాలను లెక్కించే విధానాల గురించి రైతులకు ఇలా వివరించారు.

విత్తన ఎంపిక..

పంట సాగులో విత్తనం ప్రభావం నుంచి విత్తనాన్ని నాటితే ఉత్తమ ఫలితాలను అందుకోవచ్చు. అనుకూలమైన, ఆరోగ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకుంటే రైతులకు అన్నివిధాలా శ్రేయస్కరం. విత్తన నాణ్యత ప్రమాణాలను మొలక శాతం ఆధారంగా నిర్ధారిస్తారు. అందుకు తెలుగు రాష్ట్రాల్లో విత్తన పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ రాజేంద్రనగర్, ఆంధ్రప్రదేశ్‌లోని తాడెపల్లి గూడెం, ఎమ్మిగనూరుల్లో విత్తన పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించి విత్తనాలను ఎంపిక చేస్తారు. ఆ విత్తనాలను ప్రభుత్వం, ప్రైవేటు కంపెనీలు నిర్ధారించి రైతులకు సరఫరా చేస్తారు. రైతులు తాము పండించిన పంట నుంచి కూడా విత్తనాలు తయారు చేసుకోవచ్చు. విత్తనాలను మొలక కట్టి వాటి నాణ్యత ప్రమాణాలను బట్టి ఎంపిక చేసుకోవచ్చు. రైతులు నాలుగు పద్ధతుల్లో తెలుసుకోవచ్చు. రైతు స్థాయిలో విత్తన మొలక శాతాన్ని తెలుసుకునే పద్ధతులు ఉన్నాయి.

పేపర్ టవల్ పద్ధతి..

పేపర్ టవల్ లేదా మందపాటి బట్టను తీసుకొని బాగా తడిపి గచ్చునేలపై పరిచి 100 గింజలను వరుసలో అమర్చాలి. దీనిపై మరో తడి పేపర్ టవల్‌ను పరచి రెండింటిని కలిపి చాపలా చుట్టాలి. చివర్లో దారంతో చుట్టి, ఏదైనా పాత్రలో ఏటవాలుగా పెట్టాలి. అప్పుడప్పుడు నీటితో తడుపుతూ ఉండాలి. ఈ పద్ధతి ద్వారా వరి, జొన్న, పొద్దుతిరుగుడు విత్తనాలను పరీక్షించుకోవచ్చు.

ట్రే పద్ధతి..

లావు గింజ రకాలైన పత్తి, వేరుశనగ, ఆముదం వంటి విత్తనాలను ఇసుక పోసిన ప్లాస్టిక్ ట్రేలో వేయాలి. 100 విత్తనాలను అంగుళం లోతు ఇసుకలో విత్తుకోవాలి. తేమ ఉండేటట్లు నీళ్ల చల్లుతూ ఉండాలి.

పెట్రిడిష్ పద్ధతి..

వంగ, టమాట, మిరప వంటి చిన్న విత్తనం మొలకలను పరీక్షించుకోవచ్చు. పెట్రిడిష్‌లో బ్లాటింగ్ పేపరును అమర్చి నీటితో తడపాలి.

గుడ్డమూట పద్ధతి..

మొలక కట్టాల్సిన 100 విత్తనాలను గుడ్డలో మూత కట్టి దీనిని చిన్న ప్లేటులో పెట్టి అప్పుడప్పుడు తడుపుతూ ఉండాలి. ఈ పద్ధతి ద్వారా 5నుంచి 10 రోజుల్లో మొలక శాతాన్ని తెలుసుకోవచ్చు.

మొలక శాతం..

- ➡ సామాన్యంగా పరీక్షకు తీసిన శాంపిల్ గింజల్లో నూటికి 99 శాతం మంచి గింజలు ఉండాలి.
- ➡ మొక్కజొన్నకు 90 శాతం మొలకలు రావాలి.
- ➡ ఇతర ధాన్యాలకు 75 నుంచి 80 శాతం మొలకలు రావాలి.
- ➡ పప్పు దినుసులకు 75 నుంచి 80 శాతం మొలకలు రావాలి.
- ➡ నునె గింజలకు 70 నుంచి 80 శాతం మొలకలు రావాలి.
- ➡ పత్తి, బెండ విత్తనాలకు 65 శాతం మొలకలు రావాలి.

ఉపయోగాలు..

రైతులు పైన పేర్కొన్న నాలుగు పద్ధతుల్లో తమ స్థాయిలో మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి.

- ➡ మొలక శాతం పరీక్షల అనంతరం పంట పెంచుకోవడం వలన వృథా సమయం కాదు.
- ➡ ఎంచుకున్న విత్తనాలు సరైనవా...కాదా? అనే విషయం గుర్తించ వచ్చును.
- ➡ విత్తనాల విషయంలో ఆర్థికంగా నష్టపోకుండా జాగ్రత్త పడవచ్చు.
- ➡ నాణ్యమైన విత్తనాలను నాటితే అధిక దిగుబడి పొందవచ్చు.

మద్యం పట్టివేత



కేటీదొడ్డి: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మహ్మద్‌ఖలీద్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. కేటీదొడ్డి మండలంలోని నందిన్నె చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. రాయిచూర్ నుంచి గట్టు మండలం బింగిదొడ్డి తండాకు చెందిన కేతావత్ మహేష్ బైక్‌పై మద్యాన్ని, 13 టెట్రా ప్యాకెట్లను తరలిస్తూ పట్టుబడ్డాడు. అతన్ని అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీలో ఏఎస్‌ఐ జిక్కిబాబు, కానిస్టేబుల్ జగదీష్, రఘునాథం, రజినీబాబు ఉన్నారు.


అనుమానాస్పద స్థితిలో మృతి

ఉప్పునుంతల: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండలంలోని లక్ష్మాపూర్‌లో చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ గురుస్వామి వివరాల ప్రకారం.. లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన పానుగంటి ప్రకాష్(35)కు బల్మూర్ మండలం మైలారం గ్రామానికి చెందిన రేణుకతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వారిద్దరి మధ్య గొడవ కావడంతో ఏడాది క్రితం ఆమె తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. ప్రకాష్ తల్లి శాంతమ్మ ఆరోగ్యం బాగాలేక అచ్చంపేట సమీపంలోని వలపట్లలో ఉన్న కూతురు వద్దకు వెళ్లింది. సోమవారం సాయంత్రం ఆమె ఇంటికి వచ్చి కొడుకు కోసం వెతికినా కనిపించలేదు. రాత్రి గ్రామానికి చెందిన అజమోని నర్సింహను తన కొడుకు గురించి అడుగగా, చెరువు కట్ట సమీపంలో ఒక సంచి, టవాల్ కన్పించాయని చెప్పాడు. మంగళవారం ఉదయం ఆమె దయాదులైన బాలస్వామి, శ్రీరాములును వెంట తీసుకొని చెరువు కట్ట దగ్గరికి వెళ్లింది. చెరువు ఒడ్డున ప్రకాష్ మృతదేహం కనిపించింది. తన కొడుకు మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అచ్చంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా...

‘షెడ్యూల్ 5’పై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

తదుపరి విచారణ 4 వారాలకు వాయిదా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో షెడ్యూల్ 5 అమలుకు సంబంధించి దాఖలైన పిటిషన్‌లో కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం...జెడ్పీటీసీ, డైరెక్టర్లు, కో–ఆపరేటివ్ చైర్మన్లు సహా అన్ని పోస్టులను గిరిజనులకే కేటాయించాలని, ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కొత్తగూడెం జిల్లాకు చెందిన లంబాడి హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి భూక్యా దేవనాయక్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. రాష్ట్రంలో 12% గిరిజన జనాభా ఉందని, సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన వీరి అభ్యున్నతి కోసం...గిరిజన ప్రాంతాల్లో వారినే స్థానిక సంస్థలు, ఇతర పదవుల్లో నియమించాలని పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం ...ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్లకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

వర్సిటీల పాలకమండలి సభ్యుల పదవీ కాలం పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని తొమ్మిది విశ్వవిద్యాలయాలకు సంబంధించిన క్లాస్–2 పాలక మండలి సభ్యుల పదవీ కాలాన్ని మరో ఏడాది పెంచుతూ మంగళవారం విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి పదవీ కాలం ఏప్రిల్‌తో ముగియడంతో..పాలకమండలి సభ్యులుగా యూనివర్సిటీకి చెందిన సీనియర్ ప్రొఫెసర్, ప్రిన్సిపల్, ప్రభుత్వం నామినేట్ చేసే ముగ్గురు సభ్యులు ఉంటారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులకు 14 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని పీఆర్‌టీయూటీఎస్ డిమాండ్ చేసింది. ఆ సంఘం అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి ఈమేరకు ప్రభుత్వానికి లేఖ రాశారు.

ఏపీ విద్యా విధానాలపై ఐరాస అభినందనలు

బాలికా విద్యకు ఏపీ సీఎం జగన్ ప్రోత్సాహం బాగుంది

ఐరాస లక్ష్య సాధనకు కృషి చేస్తున్నారని ప్రశంసలు



నాడు–నేడు స్టాల్‌ను సందర్శించిన ఐక్యరాజ్యసమితి ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్ ప్రపంచ అధ్యక్షురాలు లచ్చెజర స్టోవ్

సాక్షి, అమరావతి: ఐక్యరాజ్య సమితి లక్ష్యాలైన అందరికీ విద్య, వైద్యం, పేదరిక నిర్మూలన కోసం నవరత్నాలు, నాడు – నేడు, సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఐరాస ఎకనామిక్, సోషల్ కౌన్సిల్ అంతర్జాతీయ అధ్యక్షురాలు లచ్చెజర స్టోవ్ ప్రశంసించారు. ఐరాస ప్రధాన కార్యాలయమైన న్యూయార్క్‌లో ఆర్థిక, సామాజిక మండలి నేతృత్వంలో సుస్థిరాభివృద్ధిపై జూలై 17న జనరల్ అసెంబ్లీ హాలులో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు – నేడు, విద్యారంగంలో పథకాలకు సంబంధించి ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. జగనన్న విద్యాకానుక కిట్లు, విద్యా దీవెన, అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యార్థులకు ఇచ్చే ఇతర ప్రోత్సాహకాల పోస్టర్లను ప్రదర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులు, అటల్ టింకరింగ్ ల్యాబ్స్, స్మార్ట్ బోర్డ్స్, బైజూస్ ట్యాబ్స్ నమూనాలను ప్రదర్శించారు. ఐరాస స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ వున్నవ షకిన్ కుమార్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన విద్యారంగ సంస్కరణలు, వివిధ పథకాల ద్వారా విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేలా సీఎం జగన్ ప్రోత్సహిస్తున్న తీరు, డిజిటల్ బోధన, డిజిటల్ క్లాస్ రూమ్స్ గురించి వివరించారు. నాడు – నేడు స్టాల్‌ని సందర్శించిన ఎకనామిక్ సోషల్ కౌన్సిల్ ప్రపంచ అధ్యక్షురాలు లచ్చెజర స్టోవ్ ఆసక్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్ బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడాన్ని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టోఫెల్ ట్రైనింగ్, సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్, బైలింగ్యువల్ డిక్షనరీలు, గోరుముద్ద, ఆణిముత్యాల పథకాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. పేద విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని షకిన్ కుమార్ ఆమెకు వివరించారు. డిజిటల్ ఇండియా దిశగా అడుగులు వేస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యా విధానాలను కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రశంసించారు.

ఏపీ స్టాల్‌పై పలు దేశాల ఆసక్తి

టాంజానియా ఆర్థిక శాఖా మంత్రి నటూ వాంబా ఏపీ స్టాల్‌ను సందర్శించి విద్యాభివృద్ధికి సీఎం జగన్ చేస్తున్న కృషిని అభినందించారు. అమెరికా పర్మినెంట్ అబ్జర్వర్ మిషన్ టూ యునైటెడ్ నేషన్స్ ప్రొఫెసర్ ఒట్టో ఫీజిన్ బ్లాట్, అమెరికన్ డిప్లొమాటిక్ అకాడమి రిప్రజెంటేటివ్ టు యునైటెడ్ నేషన్స్ ప్రెసిడెంట్ బిల్ గ్రాహమ్ తదితరులు ఏపీ విద్యా విధానాలను తెలుసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో సునీత చిట్టామూరి తదితరులు పాల్గొన్నారు.

‘మార్గదర్శి’ కేసు విచారణ వాయిదా

- 56 వేల పేజీల డిపాజిటర్ల వివరాలు అందజేసిన సంస్థ
- అన్ని పక్షాలు రెండు పేజీల నోట్ దాఖలు చేయండి
- సెప్టెంబరు 26కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ : ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించారంటూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ మీద దాఖలైన పిటిషన్లకు సంబంధించిన విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. 72 వాల్యూమ్‌లతో 56వేల పేజీల డిపాజిటర్ల వివరాలను సంస్థ మంగళవారం కోర్టుకు అందజేయగా దానిని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు న్యాయస్థానం పేర్కొంది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై ఉండవల్లి అరుణ్‌కుమార్, ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ కేసులో ఏపీ ప్రభుత్వానికి పిటిషన్ దాఖలు చేసే అర్హతలేదని సంస్థ తరఫు సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే ఆరోపించారు. దీన్ని పార్టీ ఇన్‌పర్సన్ ఉండవల్లి అరుణ్ కుమార్, న్యాయవాది రమేశ్ అల్లంకి, ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ విభేదించారు. ఏపీ, తెలంగాణ ఇద్దరినీ పార్టీ చేసినట్లు ఉండవల్లి కోర్టుకు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇంకా కౌంటరు దాఖలు చేయలేదని న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఏపీ ప్రభుత్వం రిజాయిండరు దాఖలు చేసినట్లు వైద్యనాథన్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కౌంటరు దాఖలు చేయాలని తదుపరి విచారణలోగా అన్ని పార్టీలు ప్లీడింగ్స్ పూర్తిచేయాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ సెప్టెంబరు 26కు వాయిదా వేసింది. ఈలోగా 2 పేజీల నోట్ సమర్పించాలని అన్ని పక్షాలను కోర్టు ఆదేశించింది.

ఏపీ పిటిషన్ మరో ధర్మాసనానికి..

మరోవైపు.. తెలంగాణ హైకోర్టులో మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు సంబంధించిన కేసులు ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలన్న ఏపీ ప్రభుత్వ పిటిషన్ మంగళవారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ ఎస్. వెంకటనారాయణ భట్టిల ధర్మాసనం ముందుకొచ్చింది. ఈ పిటిషన్‌ను తాను సభ్యుడుగా లేని ధర్మాసనం ముందు జాబితా చేయాలని జస్టిస్ ఎస్. వెంకటనారాయణ భట్టి కోరారు. ఈ మేరకు రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

నిలిచిన వైద్యుల పదోన్నతులు

- పదోన్నతుల ప్రక్రియలో ఉద్రిక్తత
- ఖాళీలను చూపకపోవడంపై డాక్టర్ల అభ్యంతరం.. డీఎంఈ కార్యాలయంలో నిలిచిన కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లను అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించేందుకు నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియలో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. వైద్యుల ఆందోళనలతో కౌన్సెలింగ్ నిలిచిపోయింది. తదుపరి కౌన్సెలింగ్ ఎప్పుడన్న అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు.

- రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ మెడికల్, డెంటల్ కాలేజీల్లో పనిచేస్తున్న క్లినికల్, నాన్ క్లినికల్, సూపర్ స్పెషాలిటీస్ సహా డెంటల్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తూ వైద్య విద్యా సంచాలకుడు(డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. మొత్తం 190 మంది డాక్టర్లకు పదోన్నతులు కల్పిస్తూ జాబితా విడుదల చేశారు. వారికి మంగళవారం ఉదయం 10 గంటలకు డీఎంఈ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ ఖాళీలన్నీ చూపకుండా కేవలం అభ్యర్థుల సంఖ్య ప్రకారమే చూపడంపై విమర్శలు వెల్లువెత్తాయి. రాష్ట్ర స్థాయిలో 900 ఖాళీలుండగా, అభ్యర్థుల సంఖ్య ప్రకారమే ఖాళీలు చూపించడం ఏంటని డాక్టర్లు ప్రశ్నించారు. కేవలం తెలంగాణ వచ్చిన తర్వాత ఏర్పడిన కొత్త కాలేజీల్లోనే ఖాళీలు చూపించారని, పాత కాలేజీల్లో ఎందుకు చూపడం లేదని నిలదీశారు. ఉస్మానియా, గాంధీ వంటి మెడికల్ కాలేజీల్లో ఉన్న అన్ని ఖాళీలు ఎందుకు చూపడంలేదని ప్రశ్నించారు.దీనిపై ఉద్రిక్తత నెలకొనడంతో కౌన్సెలింగ్ వాయిదా పడింది.

ఖాళీలను చూపిస్తే హైదరాబాద్‌కే ప్రాధాన్యం..

అన్ని కాలేజీల్లో ఖాళీలను చూపిస్తే పదోన్నతులు పొందిన వారంతా కూడా హైదరాబాద్ లేదా సమీపంలోని మెడికల్ కాలేజీలకే ప్రాధాన్యం ఇస్తారని డీఎంఈ వర్గాలు చెబుతు న్నాయి. కొత్త కాలేజీలకు అసోసియేట్ ప్రొఫెసర్ల అవసరం చాలా ఉందని, దాంతో వాటిని ప్రభుత్వం పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించినట్టు చెబుతున్నారు.

అందరూ అలానే అడగరంటున్న వైద్యుల సంఘం

అందరూ ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీలనే అడగడం లేదని, అన్ని అసోసియేట్ ప్రొఫెసర్ ఖాళీలు చూపిస్తే వచ్చే నష్టమేమి లేదని తెలంగాణ బోధనా ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అన్వర్, ప్రధాన కార్యదర్శి జలగం తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ కిరణ్ మాదల అంటున్నారు.

నిబంధనల మేరకే కౌన్సెలింగ్

జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) నిబంధనల ప్రకారం కొత్త మెడికల్ కాలేజీలలో పోస్టుల భర్తీకి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని డీఎంఈ రమేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కళాశాలల్లో అభ్యర్థుల లభ్యత, అవసరాల ఆధారంగా ఖాళీల మ్యాట్రిక్స్ తయారు చేశామన్నారు. కొందరు అనవసరంగా గందరగోళం సృష్టించి కౌన్సెలింగ్ ప్రక్రియను అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం వివిధ జిల్లాల్లోని కాలేజీల్లో సేవలు చేయాలని కోరుకుంటోందన్నారు.

ఉస్మానియాలో జనరల్ సర్జరీలో 31 మంది, పీడియాట్రిక్స్‌లో 55 మంది, ఓబీజీలో 55 మంది, ఆర్థోలో 19 మంది, అనస్థీషియాలో 25 మంది, జనరల్ మెడిసిన్‌లో 27 మంది, గాంధీలో 23 మంది జనరల్ మెడిసిన్, 26 మంది జనరల్ సర్జరీ, 31 మంది అనస్థీషియా ఫ్యాకల్టీలున్నారని వివరించారు. మిగిలిన చోట్ల నింపాల్సిన అవసర ముందన్నారు. నిలిచిన కౌన్సెలింగ్ ప్రక్రియపై ప్రభుత్వంతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని రమేష్ రెడ్డి వివరించారు.

11 ఎకరాలు ఎలా కేటాయించారు?

- కోకాపేటలో విలువైన భూమిని కేబినెట్ అనుమతి లేకుండానే అధికారపార్టీకి కట్టబెట్టారా?
- ప్రభుత్వానికి, బీఆర్‌ఎస్ పార్టీకి హైకోర్టు నోటీసులు
- కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం.. విచారణ వాయిదా

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట సర్వే నంబర్ 239, 240లో అత్యంత విలువైన 11 ఎకరాల భూమిని భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్)కు కేటాయించడంపై రాష్ట్ర ప్రభుత్వానికి, ఆ పార్టీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కేబినెట్ అనుమతి లేకుండానే కేటాయించారా అని ప్రశ్నించింది. కేటాయింపుపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 16కు వాయిదా వేసింది. బీఆర్‌ఎస్‌కు 11 ఎకరాల కేటాయింపును సవాల్ చేస్తూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీవో) కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఎకరం దాదాపు రూ.50 కోట్ల మార్కెట్ విలువైన స్థలాన్ని.. కేవలం రూ.3,41,25,000కే ప్రభుత్వం ముట్టజెప్పిందని.. అలా 11 ఎకరాలకు గానూ దాదాపు రూ.500 కోట్లు ప్రభుత్వానికి నష్టమని పేర్కొన్నారు. దీనిపై మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది.

ఇంకా కేబినెట్ నిర్ణయం తీసుకోలేదన్న ప్రభుత్వం

ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) జె.రామచందర్‌రావు వాదనలు వినిపిస్తూ.. కోకాపేట్‌లోని 11 ఎకరాల స్థలాన్ని బీఆర్‌ఎస్ కార్యాలయ నిర్మాణానికి కేటాయించడంపై కేబినెట్ ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. కేబినెట్ నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రొసీడింగ్ కాపీని పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సత్యంరెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఎలాంటి టెండర్లు లేకుండానే బీఆర్‌ఎస్ పార్టీకి అత్యంత విలువైన ప్రాంతంలో భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. భూమి కేటాయించి.. నిర్మాణం చేపట్టినా ఇప్పటివరకు పబ్లిక్ డొమైన్‌లో ఆ వివరాలను ఉంచలేదని సత్యంరెడ్డి వెల్లడించారు. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్స్ కాపీని అందజేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం .. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హెచ్‌ఎండీఏ కమిషనర్, భూ పరిపాలన చీఫ్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో పాటు బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది.

విద్యుత్ సేవలు.. వినియోగదారుల హక్కు

- నేరుగా ఫిర్యాదు చేయొచ్చు..
- సమస్య పరిష్కరించకుంటే అధికారులకు జరిమానా
- కల్వకుర్తిలో సీజీఆర్‌ఎఫ్ కోర్టు చైర్మన్ దిలీప్‌కుమార్



కోర్టులో వినియోగదారుల సమస్యలు వింటున్న చైర్మన్, సభ్యులు

కల్వకుర్తి టౌన్: విద్యుత్ సంస్థల ద్వారా అందిస్తున్న సేవలు హక్కుగా వినియోగదారులు వినియోగించుకోవాలని టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సంస్థ సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ దిలీప్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల పరిష్కార కోర్టు కార్యక్రమానికి సీజీఆర్‌ఎఫ్ సభ్యులు శోభారాణి, నాగేశ్వర్‌రావులు హాజరయ్యారు. విద్యుత్ సంస్థలు అందించే సేవల్లో ఎలాంటి లోపాలు, సమస్యలున్నా, వినియోగదారులు నేరుగా ఫిర్యాదు చేయొచ్చని దిలీప్‌కుమార్ అన్నారు. వినియోగదారులు ముందుగా సమస్యపై సబ్‌డివిజన్ స్థాయిలో ఫిర్యాదు చేయాలని, అక్కడ పరిష్కారం కాకపోతే నేరుగా సీజీఆర్‌ఎఫ్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించకపోతే సంస్థ కోర్టులో వారిని ప్రశ్నిస్తామన్నారు. సమస్యను పరిష్కరించని అధికారులపై భారీగా జరిమానా విధించి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన సీజీఆర్‌ఎఫ్ కోర్టుకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రైతులు, వినియోగదారులు వచ్చి ఫిర్యాదులు చేశారు. వారి సమస్యలు నోట్ చేసుకొని వారి ధృవీకరణ పత్రాలు అందించారు. 30 మంది వినియోగదారుల నుంచి పలు రకాల సమస్యలపై ఫిర్యాదులొచ్చాయని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ దిలీప్‌కుమార్ తెలిపారు.

48 గంటల్లో ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ చేయాల్సిందే..

రైతు పొలం దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు రిపేర్ వస్తే 48 గంటల్లో రిపేర్ చేసి బిగించాలని ఆయన అన్నారు. గతంలో విద్యుత్ కనెక్షన్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై అధికలోడ్ పెరిగినప్పుడు విద్యుత్ సంస్థనే నేరుగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. దీనికోసం విద్యుత్ ఉద్యోగులు డబ్బులు అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. సీజీఆర్‌ఎఫ్ కోర్టులో సమస్యలపై ఫిర్యాదు చేయొద్దని రైతులను విద్యుత్ అధికారులు, యూనియన్ నాయకులు బతిమలాడినట్లు కనిపించింది. కార్యక్రమంలో ఎస్ఈ లీలావతి, డీఈ ఆపరేషన్స్ శ్రీధర్, డీఈ టెక్నికల్ రవికుమార్, ఎస్ఏఈ పార్థసారథి, కల్వకుర్తి ఏడీఈ చంద్రశేఖర్, డివిజన్‌లోని ఏఈలు, విద్యుత్ సిబ్బంది, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.

డీడీలు కట్టినా.. కనెక్షన్ ఇవ్వలే



నా వ్యవసాయ పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని 2020లో డీడీలు కట్టాను. డీడీలు కట్టి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. విద్యుత్ అధికారికి ఎప్పుడు ఫోన్ చేసినా కనీసం లిఫ్ట్ చేయడు. కార్యాలయానికి వెళ్లినా ఏదో ఒక సాకు చెప్పి తర్వాత మాట్లాడుదామని చెబుతాడు. అధికారి ప్రవర్తనతో విసుగు చెంది చివరకు సీజీఆర్‌ఎఫ్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చా.

–ఉపేందర్, రైతు, పెద్దకొత్తపల్లి

తీగలను సరిచేయటం లేదు



గ్రామంతో పాటుగా రైతుల పొలాల వద్ద విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. నిత్యం ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని పొలం పనులకు వెళ్తున్నాం. వేలాడుతున్న తీగలపై పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదు. విద్యుత్ తీగలు కిందకు ఉండటంతో కర్రలతో వాటిని మనుషులకు తగలకుండా చేస్తున్నాం. మండల విద్యుత్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో సీజీఆర్‌ఎఫ్‌లో ఫిర్యాదు చేశాను.

– నరేందర్, మాధారం, ఊర్కొండ

సింథటిక్ ట్రాక్ నిర్మాణం.. క్రీడాకారులకు వరం

- అంతర్జాతీయ స్థాయిలో అథ్లెటిక్స్‌కు గుర్తింపు..
- ట్రాక్ నిర్మాణం కోసం ఔత్సాహికుల ఎదురు చూపు
- అథ్లెట్లు మెరుగైన ప్రాక్టీస్ ఇక్కడే చేసుకోవచ్చు..
- గతంలో సాయ్‌కు చేరిన అథ్లెటిక్స్ ట్రాక్ ప్రతిపాదనలు



జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరు జిల్లా కేంద్రం క్రీడల హబ్‌గా మారుతోంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లా కేంద్రంలో క్రీడాభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. మెయిన్ స్టేడియంలో వాలీబాల్ అకాడమీని ఏర్పాటు చేశారు. త్వరలో అకాడమీలో క్రీడాకారులకు ప్రవేశం కల్పించనున్నారు. మరోవైపు స్టేడియంలో అధునాతనమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నారు. ఈ స్టేడియం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఖోఖో, వాలీబాల్, లాంగ్‌జంప్, హైజంప్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులతో పాటు ఆర్చరీ జోన్ ఏర్పాటు చేశారు. మెయిన్ స్టేడియంలో అనేక క్రీడా సౌకర్యాలు ఉన్నప్పటికీ అథ్లెటిక్స్‌కు సింథటిక్ ట్రాక్ లేకపోవడంతో తీవ్ర క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ట్రాక్ నిర్మిస్తే క్రీడాకారులకు వరంగా మారనుంది.

స్టేడియం పరిశీలించిన కేంద్ర కమిటీ సభ్యులు..

ఖేలో ఇండియా పథకం ద్వారా పలు జిల్లాల్లో అధునాతనమైన సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌లు ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలోని మెదక్, వరంగల్ జిల్లాల్లో సింథటిక్ ట్రాక్ నిర్మించారు. ఖేలో ఇండియా పథకం ద్వారా సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటు కోసం ముందుగా జిల్లా యువజన, క్రీడలశాఖ ద్వారా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణసెట్ (సాట్)కు ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు సాట్స్ నుంచి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్)కు ప్రతిపాదనలు పంపారు. మెయిన్ స్టేడియంలో 400మీటర్ల 8 లైన్ల సింథటిక్ ట్రాక్ ప్రతిపాదనలకు 2021 అక్టోబర్ 22న ఖేలో ఇండియా కేంద్ర పరిశీలన కమిటీ సభ్యులు పరిశీలించారు. స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు సంబంధించి ఫీజుబిలిటీ వివరాలు సేకరించారు. అయితే సింథటిక్ ట్రాక్ ఏర్పాటు కేవలం ప్రతిపాదనలు పరిమితమైందనే విమర్శలున్నాయి.



స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటును పరిశీలిస్తున్న కేంద్ర కమిటీ సభ్యులు (ఫైల్)

సింథటిక్ ట్రాక్‌తో మెరుగైన వసతులు..

జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటైతే ఔత్సాహిక క్రీడాకారులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయి. అంతర్జాతీయ స్థాయిలో సౌకర్యాలు ఉంటాయి. ఈ ట్రాక్ ఏర్పాటు ద్వారా మెయిన్ స్టేడియానికి మరింత గుర్తింపు వస్తుంది. జాతీయ, అంతర్జాతీయ టోర్నీలు ఇక్కడే జరిగే అవకాశం ఉంటుంది. జిల్లాకు చెందిన అథ్లెటిక్స్ క్రీడాకారులు హైదరాబాద్‌కు వెళ్లకుండా ఇక్కడే సింథటిక్ ట్రాక్‌లో రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేసే అవకాశం ఉంటుంది. మెయిన్ స్టేడియంలో వర్షం వచ్చినప్పుడల్లా నీళ్లచేరి క్రీడాకారులు ప్రాక్టీస్‌కు ఆటంకం ఏర్పడుతోంది. సింథటిక్ ట్రాక్ ఉంటే ట్రాక్ చుట్టూ కర్బోవాల్ ఏర్పాటు చేసి వర్షపు నీళ్ల ట్రాక్‌లోకి రాకుండా ఏర్పాటు చేస్తారు. మంత్రి చొరవతో ఇప్పటికే అనేక క్రీడాభివృద్ధి పనులు మెయిన్ స్టేడియంలో జరుగుతున్నాయి.

త్వరలోనే ఏర్పాటు..




రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషితో మెయిన్ స్టేడియంలో పలు క్రీడాభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మంత్రి ప్రత్యేక చొరవతో త్వరలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మెయిన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఈ ట్రాక్ ఏర్పాటు చేస్తే అథ్లెటిక్స్ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ప్రాక్టీస్ లభిస్తుంది.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

డబుల్ బెడ్రూం ఇళ్ల పేరిట దగా..

బీజేపీ నేత డీకే అరుణ



డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న డీకే అరుణ

గద్వాల: పేదల సొంతింటి కలను నిజం చేస్తామని డబుల్ బెడ్రూం పథకం పేరిటి హామీ ఇచ్చి సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లుగా ప్రజలను దగా చేస్తున్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆరోపించారు. మంగళవారం గద్వాల పట్టణ శివారులో చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లను ఆమె పరిశీలించారు. నాసిరకం నిర్మాణాలు, పగిలిపోయిన కిటికీ అద్దాలు, ఊడిపోయిన డోర్లు ఉన్నాయని తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల కోసం గజం స్థలం కూడా సేకరించలేదని, ఒక్కరికి కూడా ఇళ్ల పట్టా ఇవ్వలేదని మండి పడ్డారు. రెండేళ్లుగా డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో రాజకీయ పబ్బం గడుపుతున్నారని ధ్వజమెత్తారు. డిప్‌లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇప్పటికీ డబుల్ బెడ్రూంలు ఇవ్వకుండా రాజకీయ జిమ్మిక్కులు చేస్తున్నారని ఆరోపించారు. తన హయాంలో ఇచ్చిన పేదల ఇళ్ల పట్టాలను దౌర్జన్యంగా లాక్కొని, ఆ స్థలంలో నర్సింగ్ కళాశాల కడుతున్నారని మండిపడ్డారు. డిప్ ద్వారా కేటాయించిన లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 24న బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, కుమ్మరి శ్రీను, బండల పద్మావతి, కృష్ణవేణి, జయశ్రీ, వెంకటేశ్వర్‌రెడ్డి, యల్లప్ప, ఆనంద్, నాగేందర్, నర్సింహ, భాస్కర్ యాదవ్, అనిల్, నల్లారెడ్డి, రామంజి పాల్గొన్నారు.

తాగునీటికి 20 క్యూసెక్కుల వినియోగం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయం నుంచి తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జలాశయంలో పూర్తి నీటి మట్టం 1,017 అడుగులకు నీరు చేరినట్లు తెలిపారు. జూరాల ఎడమ, సమాంతర కాలువ, రామన్‌పాడు ఎన్‌టీఆర్ కాలువ నీటిని నిలిపేశారు.


పీయూ ఈసీ పదవీకాలం పొడిగింపు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ పదవీకాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పీయూ ఈసీలో క్లాస్– 2 నామినేటెడ్ సభ్యులు ఆరు మంది ఉండగా.. క్లాస్–1 ఉన్నారు. వీరి పదవీకాలంలో ఒక సంవత్సరం వరకు లేదా.. కొత్తవారిని వచ్చే వరకు ఉంటుందన్నారు.

బతుకు పోరులో..

కోటి విద్యలు కూటి కోసమే అంటారు పెద్దలు. ఇదే జీవన సత్యంగా భావించిన ఆ బడుగు జీవులు ప్రాణాలను పణంగా పెట్టి నదిలో చేపల వేటకు బయలుదేరారు. కొల్లాపూర్ మండలం సోమశిల సమీపంలోని కృష్ణానదిలో పలువురు మత్స్యకారులు చేపల వేట కోసం పుట్టీలలో తిరుగుతూ వల విసురుతున్న దృశ్యాలను ‘సాక్షి’ కెమెరా క్లిక్‌మనిపించింది.

– కొల్లాపూర్



చేపల వేట కోసం నదిలోకి వల విసురుతున్న మహిళ,(ఇన్‌సెట్లో)భార్యాబిడ్డలతో కలిసి పుట్టిపై నదిలో తిరుగుతూ వల విసురుతున్న మత్స్యకారుడు